దానం గెలుపుతోనే సికింద్రాబాద్ అభివృద్ధి


దానం నాగేందర్‌కు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్న సంతోష్‌గుప్తా, మమతా గుప్తా

అబిడ్స్: సికింద్రాబాద్‌లో దానం నాగేందర్ గెలుపుతోనే సికింద్రాబాద్ నలుమూలల అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి జరుగుతుందని గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంతోష్‌గుప్తా, మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా పేర్కొన్నారు. 30 ఏళ్లుగా గ్రేటర్ ప్రజలకు దానం నాగేందర్ ఎమ్మెల్యేగా అండగా ఉండి ఎంతో సేవలు అందించారన్నారు. సికింద్రాబాద్‌లో దానం నాగేందర్‌ను గెలిపిస్తే ప్రజలకు అండగా ఉండి వారి మేలుకు కృషి చేస్తానన్నారు. సోమవారం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వారు పర్యటించి దానం నాగేందర్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సంతోష్‌గుప్తా, మమతా గుప్తా మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లోనే అమలు చేశారని గుర్తుచేశారు. గత ఐదేళ్లుగా ఎంపీగా ఉన్న కిషన్‌రెడ్డి ప్రజలకు ఏ నాడు అందుబాటులో లేరన్నారు. కేవలం ఢిల్లీలో ఉంటూ సికింద్రాబాద్ ప్రజలను మరిచిపోయారని వారు గుర్తుచేశారు. నాగేందర్‌ను గెలిపిస్తే ప్రజలకు అండగా ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తారని పేర్కొన్నారు.

కేసీఆర్ చేసిన అభివృద్ధితోనే బీఆర్ఎస్ విజయం


ప్రచారం నిర్వహిస్తున్న ఎంఎస్ ప్రభాకర్‌రావు, ఆనంద్ కుమార్‌గౌడ్

అబిడ్స్/గోల్కొండ: పదేళ్ల మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధితోనే సికింద్రాబాద్ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు, నాంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ సీహెచ్. ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. నాంపల్లి నియోజకవర్గంతో పాటు తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల కోసం చేపట్టిన సంక్షేమం, ప్రగతి అభివృద్ధి దేశంలో ఎక్కడ జరగలేదన్నారు. నాంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వారు పర్యటించి పద్మారావును గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. అనంతరం ప్రభాకర్‌రావు, ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..మైనార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలు కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధిని తిరిగి ఆకాంక్షిస్తున్నారన్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా కాంగ్రెస్‌తో విసిగిపోతున్న ప్రజలు తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలని కోరుతున్నారన్నారు. సికింద్రాబాద్‌లో ఎంపీ కిషన్‌రెడ్డి ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే నాంపల్లి నియోజకవర్గం పెద్ద ఎత్తున అభివృద్ధి చెందుతుందని ఎంఎస్ ప్రభాకర్‌రావు, ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ సెంటర్ ప్రారంభం


వ్యాక్సినేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ మజహరుల్లా, హజ్ కమిటీ ఈఓ లియాకత్ హుస్సేన్

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రి నగరంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల్లో మేటి అని తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ కార్యనిర్వహణ అధికారి లియాకత్ హుస్సేన్ అన్నారు. ఈ సంవత్సరం హజ్ యాత్రకు ఎంపికైన వారి కోసం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్ కేంద్రాన్ని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ ఆసుపత్రిలో మొట్ట మొదటిసారిగా ఈ వ్యాక్సినేషన్ కేంద్రం ప్రారంభమైందని ఈ కేంద్రం ఏర్పాటులో డాక్టర్ మజహరుల్లా ఎంతో చొరవ చూపారఅన్నారు. డాక్టర్ మజహరుల్లా మాట్లాడుతూ.. ప్రతినిత్యం 115 మందికి ప్రతినిత్యం వ్యాక్సిన్ వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ వినాయకరావు, ఏఓ డాక్టర్ శ్రీనివాస్‌రావు, ఎస్పీహెచ్ఈఓ డాక్టర్ మురళీ, పీస్ అండ్ మైత్రి కమిటీ ప్రతినిధి జైనులాబిదిన్ ఆబేద్, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వలంటీర్లు పాల్గొన్నారు.

'బీజేపీ, మజ్లిస్‌లకు ఓటమి తప్పదు'


బేగంబజార్‌లో ప్రచారం నిర్వహిస్తున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: బీజేపీ, మజ్లిస్‌లను చిత్తుగా ఓడించి హైదరాబాద్ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. 30 ఏళ్లుగా హైదరాబాద్ పార్లమెంట్‌లో మతం పేరుతో మజ్లిస్ ఓట్లు దండుకుంటున్నాయన్నారు. గోషామహల్ నియోజకవర్గం బేగంబజార్, శంకర్‌బాగ్, తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు. అనంతరం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..ఈ ఎన్నికల్లో అభివృద్ధి నినాదంతోనే తాము ముందుకు పోతున్నామన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో వందల కోట్ల రూపాయాల అభివృద్ధి పనులు చేపట్టినందుకే ఏ గల్లీకి, ఏ ప్రాంతానికి వెళ్లినా తనను ప్రజలు ఆదరిస్తూ గెలిపిస్తామని పేర్కొంటున్నారన్నారు. బీజేపీ అభ్యర్థి మాధవీలత, మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీని ప్రజలు చిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారు. తనను గెలిపిస్తే హైదరాబాద్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు.

అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించాలి


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: మౌలిక సదుపాయల కల్పనకు ప్రభుత్వంతో పోరాడే పార్టీ మజ్లిస్ పార్టీ ఒక్కటేనని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకీ, నానల్‌నగర్, గోల్కొండ డివిజన్లలో ఇంటింటికీ తిరిగి హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి మజ్లిస్ సిట్టింగ్ ఎంపీ, పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీని ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మజ్లిస్ పార్టీ చేయిస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు వేలాది కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో సైతం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తన ఎంపీ లాడ్ నిధులతో ఎన్నో పనులు చేయించారన్నారు. అభివృద్ధికి బాటలు వేయడం మజ్లిస్ పార్టీకే సాధ్యమని మరోసారి అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్పొరేటర్ నసీరుద్దీన్, నాయకులు వజీఉజ్‌జమా సిద్దిఖీ, సయ్యద్ ఆజామ్, షకీల్ అలీఖాన్ తదితరులున్నారు.

వీఎస్ఆర్ మూర్తికి నండూరి స్మారక పురస్కారం ప్రదానం


వీఎస్ఆర్ మూర్తికి పురస్కారాన్ని అందజేస్తున్న అతిథులు

సుల్తాన్‌బజార్: నండూరి రామకృష్ణ ఆచార్య సాహిత్య పీఠం, సాహితీ సమితి సంయుక్త ఆధ్వర్యంలో మహాకవి నండూరి రామకృష్ణాచార్య 104వ జయంతి సభ సోమవారం సాయంత్రం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత, అత్యాధునిక ప్రసంగకర్త వీఎస్ఆర్ మూర్తికి నండూరి స్మారక పురస్కారాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఖజానా లెక్కల శాఖ సంచాలకులు జి.వసుంధర ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..నండూరి పురస్కారాన్ని వీఎస్ఆర్ మూర్తికి ప్రధానం చేయడం ఎంతో సమంజసమన్నారు. ఈ కార్యక్రమంలో మాడభూషి శ్రీధర్, ప్రముఖ సాహితీవేత్త గౌరీ శంకర్, ఆచార్య ఫణీంద్ర, నండూరి రామకృష్ణ, సీమరాజు, విజయ్‌కుమార్, లక్ష్మీమానస, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

'ముస్లింలంతా కాంగ్రెస్ పార్టీ వైపే'


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

చార్మినార్: కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల పట్ల ముస్లింలు తమ పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని.. అందుకే ఇతర పార్టీలకు చెందిన మైనార్టీ నాయకులు తమ పార్టీలో చేరుతున్నారని బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్‌కుమార్ అన్నారు. బహదూర్‌పురాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు గులాం నబీ ఆధ్వర్యంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ వలి ఉల్లా సమీర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలతో సంతృప్తి చెందుతున్న అన్ని వర్గాల ఓటర్లు తమ పార్టీకే ఓటు వేయనున్నారన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈసారి సెక్యులర్ పార్టీ అయిన కాంగ్రెస్‌కు ఓటు వేయడానికి అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ శాసన సభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య తీరేదెన్నడో..?

- గుల్జార్‌హౌజ్‌లో నిత్యం ట్రాఫిక్ తిప్పలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


గుల్జార్‌హౌజ్ వద్ద ట్రాఫిక్ దిగ్బంధంలో వాహనాలు

చార్మినార్: చార్మినార్‌కు వెళ్లడానికి ప్రధాన రోడ్డైన గుల్జార్‌హౌజ్ ఫౌంటేన్ వద్ద ప్రతిరోజూ వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. చార్మినార్ వరకు వాహనాలను అనుమతించకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలన్నీ గుల్జార్‌హౌజ్ ఫౌంటేన్ వద్ద ఆపడంతో పాటు చుట్టూ తిరిగి ముందుకు వెళుతుంటాయి. ఇక్కడే నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్య ఎప్పుడు తీరుతుందని వాహనదారులు సంబంధిత ట్రాఫిక్ పోలీసు అధికారులను సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇక వీకెండ్‌తో పాటు సెలవులు వస్తే చాలు.. ఇక్కడి చౌరస్తాలో వాహనదారులు నరకాన్ని చవి చూడాల్సి వస్తోంది. నయాపూల్ నుంచి గుల్జార్‌హౌజ్ వరకు ట్రాఫిక్ జాం కనిపిస్తుంది.

తప్పని ట్రాఫిక్ తిప్పలు..

ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడ వాహనాలతో అడుగుపెట్టిన వారెవరైనా సరే ఇబ్బందులకు గురికాక తప్పదు. ఇక నడిరోడ్లను ఆక్రమించి కొనసాగే చిరు వ్యాపారాలతో ప్రతి నిత్యం ట్రాఫిక్ జాంలు తప్పడం లేదు. చార్మినార్ కాలిబాట పథకంలో భాగంగా చార్మినార్ కట్టడం వరకు వాహనాల రాకపోకలను గతంలోనే నిలిపి వేసిన విషయం తెలిసిందే. దీంతో చార్మినార్ ఇన్నర్ రింగ్ రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్లతో పాటు పరిసర ప్రాంతాల రోడ్లలో ప్రతిరోజూ వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ట్రాఫిక్ పోలీసులు అవసరమైన మేరకు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వాహనదారులు అంటున్నారు.

నడిరోడ్డుపై వ్యాపారాలు.. ముందుకు సాగని వాహనాలు..

గుల్జార్‌హౌజ్ ఫౌంటేన్ వద్ద అసలు ఫుట్‌పాతులే కాదు..రోడ్లను సైతం చిరు వ్యాపారస్తులు ఆక్రమించుకొని నడిరోడ్డుపై వ్యాపారాలు కొనసాగిస్తారు. గాజులు, దుస్తులు, నిత్యావసర సామగ్రి..ఒక్కటేమిటి పాతబస్తీలో సర్వమూ రహదారిపైనే అమ్మకానికి ఉంటాయి. ఆటోలు తమ వాహనాల పార్కింగ్ కూడా నడిరోడ్డు పైనే!.. పర్యాటక పరంగా, వ్యాపార పరంగా, నివాసపరంగా పాత నగరానికి జనం తాకిడి ఎక్కువగా ఉంటుంది. గుల్జార్‌హౌజ్ ప్రధాన రోడ్డు కావడంతో ఇక్కడ సహజంగానే వాహనాల రద్దీ ఉంటుంది. అందుకే శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ట్రాఫిక్ పోలీసు అధికారులపై ఉంది.

నేడు కవి సమ్మేళనం

గౌలిపురా: మే డేను పురస్కరించుకొని ఈనెల 30న 'అరసం' హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో గౌలిపురా డివిజన్ జ్ఞాన భారతి మోడల్ హైస్కూల్‌లో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు అరసం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎస్.సూర్యప్రకాష్, గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించే ఈ సమ్మేళనంలో ప్రముఖ కవి, రచయిత, పర్యటకుడు, సలాం హైదరాబాద్ పుస్తక రచయిత వరవస్తు లోకేష్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ సమ్మేళనంకు హాజరవ్వాలని వారు కోరారు.

గెలుపు నీదే బిడ్డా..

ఎన్నికల ప్రచారంలో భాగంగా మలక్‌పేట్‌లో కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థి మహమ్మద్ వలీవుల్లా సమీర్ పర్యటించగా...ఓ వృద్ధురాలు ఆయన తలపై చెయ్యి పెట్టి నీదే విజయం అంటూ ఆశీర్వదించింది.

\- చార్మినార్



'కురుమ కులస్తుల మద్దతు బీజేపీకే'

గోల్కొండ: తెలంగాణ రాష్ట్ర కురుమ సోదరులు ఈసారి ఎన్నికల్లో బీజేపీని బలపరచడానికి సమష్టి నిర్ణయం తీసుకున్నారని కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. బీజేపీ పోటీ చేసే నియోజకవర్గాల్లో కురుమ సోదరులు జిల్లాల వారీగా సమ్మేళనాలను నిర్వహించనున్నారని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కురుమల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల వల్ల కురుమ సంక్షేమానికి బాటలు వేసినట్లు అయిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో కురుమ సంఘాలన్ని ఏకతాటిపైకి వచ్చి బీజేపీని బలపరచడానికి తీర్మానం చేశాయన్నారు. ఇందులో భాగంగా మొదటి కురుమ ఆత్మీయ సమ్మేళనం వచ్చే నెల 2న ఉప్పల్, ఎల్‌బీనగర్ నియోజకవర్గాల్లో కురుమ సోదరుల కోసం సభలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వచ్చే నెల 2వ తేదీ గురువారం జరగనున్న ఈ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా బీజేపీ నాయకులు ఈటల రాజేందర్ హాజరవుతారని ఆయన తెలిపారు.

బీజేపీ నాయకుడు అమర్‌సింగ్‌కు మాతృవియోగం


అనసూయ బాయి (ఫైల్)

గోల్కొండ: బీజేపీ సీనియర్ నాయకుడు, బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ తల్లి టీ. అనసూయబాయి (98) సోమవారం మృతి చెందారు. వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో కొంత కాలంగా ఆమె బాధపడుతున్నారు. సోమవారం ఉదయం కార్వాన్‌లోని తన స్వగృహంలో ఆమె తుది శ్వాస విడిచారు. అంత్యక్రియలు పురానాపూల్‌లోని హిందూ శ్మశానవాటికలో జరిగాయి.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



సుల్తాన్‌బజార్: సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న 8 మందికి సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్, డీఎస్ఐ నరేష్ నేతృత్వంలో బాధితులకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ల ఓనర్లకు సెల్‌ఫోన్లను అప్పగించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ స్టాఫ్ తుల్జారామ్‌సింగ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వేతన సవరణ చేయాలి


చర్చలో పాల్గొన్న సంఘం నాయకులు

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ గణాంక ఉద్యోగులకు మెరుగైన వేతన సవరణ చేయాలని తెలంగాణ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ గణాంక ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.నాగమల్లేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం పే రివిజన్ కమిటీ ఆహ్వానం మేరకు సంఘం ఆధ్వర్యంలో 2వ పే రివిజన్ కమిషన్ శివశంకర్, కమిటీ సభ్యుల ముందు చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా నాగమల్లేశ్వర్‌రావు మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ప్రకటించిన వేతన స్కేల్స్‌లో భారీగా అన్యాయం జరిగిందని వాపోయారు. గణాంక ఉద్యోగులకు న్యాయ పరంగా మెరుగైన వేతన స్కేల్స్‌ను దిగువ తరగతి గణాంకాలకు, సహాయ గణాంకాల కు, ఉప గణాంకాలకు, ఉప సంచాలకులకు గణాంకములు ప్రతిపాదించాలని కోరడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ గణాంకాలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు నిరంతరం పంపిస్తూ జాతీయ స్థాయిలో ముందున్నట్లు తెలిపారు. సంఘం విజ్ఞప్తి మేరకు శివ శంకర్ కమిటీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు కె.శ్రీహరి, అసోసియేట్ అధ్యక్షులు ఎస్.శ్రీధర్‌రావు, నాయకులు ఆనంద్‌కుమార్, కోటేశ్వర్‌రావు, రాజ్‌కుమార్ పీటర్స్ సన్, రఫత్ సుల్తాన, విష్ణువర్ధన్‌రెడ్డి, మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి


సమావేశంలో దానం నాగేందర్, మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్: మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్, రాష్ట్ర మత్స్య శాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మత్స్యకారులకు అన్నివిధాలా సహకారం అందిస్తుందన్నారు. సోమవారం మత్స్యకారులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం సహకారం అందిస్తూ ముందుకుపోతుందన్నారు.

కార్వాన్‌లో బీఆర్ఎస్ కనుమరుగు..!

గోల్కొండ: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కార్వాన్‌లో ఇప్పటి వరకు బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారానికి రాలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్వాన్ నియోజకవర్గం నుంచి ఎందరో బీఆర్ఎస్ నాయకులు ఓ వెలుగు వెలిగారు. అయితే ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ లేటుగా తమ అభ్యర్థిని ప్రకటించింది. అయితే కార్వాన్ నియోజకవర్గంలో చాలా మంది బీఆర్ఎస్ సానుభూతిపరులకు బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరో తెలియని పరిస్థితి నెలకొని ఉంది. ఇప్పటి వరకు పార్టీ అభ్యర్థి ప్రచారం గానీ, కనీసం ఒక బ్యానర్ గానీ కనబడడం లేదని పలువురు అంటున్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఇద్దరు నాయకులు పార్టీని వీడారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా, ఓ దఫా కార్పొరేటర్‌గా వ్యవహరించిన నాయకుడు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. మరో సీనియర్‌నాయకుడు బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. చోటామోటా బీఆర్ఎస్ నాయకులు సైతం పార్టీని వీడారు. నియోజకవర్గంలోని డివిజన్‌లలో బీఆర్ఎస్‌కు కనీసం నాయకులు లేకుండా పోయారు. మరోవైపు బీజేపీ, మజ్లిస్‌లు ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. ఈ పరిస్థితిలో బీఆర్ఎస్ పార్టీ ఇప్పటి వరకు ప్రచారం నిర్వహించకపోవడం పట్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ చతికిలపడ్డట్లే అని పలువురు అంటున్నారు. ఏదేమైనా ఇక్కడ పదేళ్లు రాష్ట్రంలో ఓ వెలుగు వెలిసిన బీఆర్ఎస్ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

మాజీ కార్పొరేటర్ శంకర్ కన్నుమూత


శంకర్(ఫైల్)

గౌలిపురా: గౌలిపురా మాజీ కార్పొరేటర్, బీజేపీ సీనియర్ నాయకుడు కడవోయిన శంకర్ గంగపుత్ర(77) అనారోగ్యంతో ఆదివారం రాత్రి కన్నుమూశారు. మాతేశ్వర భారతమాత ఆలయం, కోటమైసమ్మ ఆలయం అధ్యక్షుడు, వీఎస్‌టీ బీఎంఎస్ యూనియన్ అధ్యక్షుడు, ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన ఆయన మరణ వార్త విషయం తెలుసుకున్న మాజీ కార్పొరేటర్లు పాశం సురేందర్, ఆలె జితేంద్ర, గౌలిపురా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్, నాయకులు డాక్టర్ భరత్ ప్రకాష్, రూప్‌రాజ్, బీవై.శ్రీకాంత్, కౌడీ మహేందర్, కేఎస్.సురేష్ కుమార్, ఇ.సుమన్‌కుమార్, మధుసూదన్, గిరి సంతాపం తెలిపారు. ఆయన ఇంటికి చేరుకొని పార్థివ దేహానికి నివాళులర్పించారు. సోమవారం మధ్యాహ్నం నల్లవాగు శ్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలు ముగిశాయి. శంకర్ మృతి వార్త తెలుసుకున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపం తెలియజేశారు. ఆయన కుమారుడు నాగరాజుకు ఫోన్‌చేసి మనోధైర్యంగా ఉండాలని సూచించారు.

శంకర్ మరణం పాతబస్తీ ప్రజలకు తీరని లోటు..

యాకుత్‌పురా: మాజీ కార్పొరేటర్ శంకర్ మరణం పాతబస్తీ ప్రజలకు తీరని లోటని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్ అన్నారు. సోమవారం సుల్తాన్‌షాహిలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వీఎస్‌టీ కార్మిక సంఘం నాయకుడిగా కార్మికుల సమస్యలపై విశేషంగా పోరాడారన్నారు. పాతబస్తీ ప్రజలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

శంకర్ అకాల మరణం బాధాకరం

చార్మినార్: ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ అధ్యక్షుడు, గౌలిపురా మాజీ కార్పొరేటర్ శంకర్ అకాల మరణం తమను ఎంతగానో బాధించిందని మీరాలంమండి మహంకాళేశ్వర్ ఆలయ కమిటీ చైర్మన్, భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటి మాజీ అధ్యక్షుడు గాజుల అంజయ్య ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పాతబస్తీలో బోనాల జాతర ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించిన ఘనత ఆయనకే దక్కు తుందన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక


దీపా దాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న గౌస్

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గౌస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ హయాంలోనే దేశం ప్రగతి పథంలో ముందుకు వెళ్లిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర పాలన కాంగ్రెస్‌కే సాధ్యం


కాంగ్రెస్ నాయకులతో కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: సుస్థిర పాలన అందించడం కేవలం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు, ఏ-బ్లాక్ అధ్యక్షుడు కురాకుల కృష్ణ అన్నారు. సోమవారం ఆయన కార్వాన్‌లో కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. అందరు వర్గాలకు అతీతంగా కలిసికట్టుగా హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ వలీ ఉల్లా సమీర్‌ను గెలిపించుకోవాలని ఈ సమావేశంలో తీర్మానించారు. కురాకుల కృష్ణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సమర్థవంతమైన పాలన తెలంగాణ ప్రజలు మెచ్చుకుంటున్నారని హైదరాబాద్ స్థానంతోనే కాకుండా తెలంగాణలో అత్యధిక ఎంపీ సీట్లు గెలుచుకోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏ.చంద్రశేఖర్, చంటిబాబు ఉన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సాహితీ మేఖల-చండూరుల ఆధ్వర్యంలో ప్రముఖ అత్తాన్ సుందర దేశికులు రచించిన సుందర రామం, శ్రీకృష్ణ చరితామృతం, వరదానంద లహరిల పుస్తకావిష్కరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..రాబోయే రోజుల్లో మరిన్ని పద్య గేయ కావ్యాలను రచించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఓయూ విశ్రాంత ప్రొఫెసర్ మసన చెన్నప, సాహితీ వేత్త రంగాచార్య సంస్థ అధ్యక్షులు ఎ.వెంకట సుబ్రమన్య శాస్త్రి, పున్న అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రమణీయం కూచిపూడి నృత్యం



గన్‌ఫౌండ్రీ: గాయత్రి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్యగురువు జ్యోతిశేఖర్ శిషురాలు గాయత్రి కూచిపూడి నృత్య రంగ ప్రవేశం కింగ్‌కోటిలోని భారతీయ విద్యభవన్‌లో ఘనంగా జరిగింది. అష్టపది శీర్షికన వివిధ అంశాలపై నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నృత్య గురువులు డాక్టర్ సుధాకర్, రత్నశ్రీ, అంతర్జాతీయ సాంస్కృతిక కమిషన్ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈసారి కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయం


వలీ ఉల్లా సమీర్‌ను సన్మానిస్తున్న కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్

చార్మినార్: ఈసారి జరిగే ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించనున్నారని గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ వలీ ఉల్లా సమీర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నికల ప్రచారంపై చర్చించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హైదరాబాద్‌లో తమ పార్టీ అభ్యర్థి విజయం ఖాయమన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


పట్టాలు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విజయనగర్‌కాలనీ: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే వరకు నిరంతరం కృషి చేయాలని విద్యావేత్తలు జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం విజయనగర్‌కాలనీ నారాయణ ఈ టెక్నో పాఠశాలలో 5వ తరగతి నుంచి 6వ తరగతిలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ.నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్ నౌషీర్‌ఖాతూన్‌లతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం


అనిత (ఫైల్)

జియాగూడ: మతిస్థిమితం లేని ఓ గృహిణి జియాగూడలో ఓ శుభకార్యానికి వచ్చి అదృశ్యమైన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామస్వామి తెలిపిన వివరాల ప్రకారం..షంషీర్ జాన్ కాల్వగడ్డ ప్రాంతానికి చెందిన అనిత(35) గృహిణి. సోమవారం సాయంత్రం జియాగూడలోని ఎస్‌డీపీ ప్యాలస్‌లో తల్లి కమలబాయితో కలిసి శుభకార్యానికి హాజరైంది. కాగా కమలాబాయి భోజనానికి వెళ్లగా తిరిగి వచ్చే లోపు అనిత అదృశ్యమైంది. గతంలో ఇంటి నుంచి వెళ్లిపోయే అనిత ఒకటి, రెండురోజుల తర్వాత వచ్చేది అని తెలిపారు. అదృశ్యమైనప్పుడు అనిత ఒంటిపై ఎరుపురంగు చీర ధరించి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.